క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

మడకశిర: మడకశిర గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. రోజూ గ్రంథాలయ సేవలను ఎంత మంది పాఠకులు ఉపయోగించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠకుల కోరిక మేరకు వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 మందికి ఉద్యోగాలు

హిందూపురం టౌన్: పట్టణంలోని సప్తగిరి కళాశాలలో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆల్‌సెక్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలను నిర్వహించారు. ఉద్యోగాలకు పొందిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

హౌసింగ్ ఏఈగా సుదర్శన్ యాదవ్


బాధ్యతలు స్వీకరిస్తున్న సుదర్శన్‌యాదవ్

గుడిబండ: మండల హౌసింగ్ ఏఈగా సుదర్శన్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గోరంట్ల మండలంలో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ యాదవ్‌ను పదోన్నతిపై గుడిబండకు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్పలమ్మ జాతర

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లిలో మంగళవారం గ్రామస్తులు సప్పలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సప్పలమ్మ గుడిని గ్రామస్తులు, ఆలయ ధర్మకర్తలు పునః నిర్మించారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామస్తులు సప్పలమ్మ జ్యోతుల ప్రదర్శన చేసి ప్రత్యేక పూజలు చేశారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో కనుమ మారెమ్మ


మడకశిరరూరల్: మండల పరిధిలోని ఎగువ రామగిరి గ్రామంలో మంగళవారం వైభవంగా కనుమ మారెమ్మకు మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. కనుమ మారెమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామ మధ్యలో కుర్చోబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలు పెద్ద సంఖ్యలో జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జ్యోతుల ఉత్సవంలో పాల్గొని వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లో విందు భోజనం స్వీకరించారు.

పనులు సద్వినియోగం చేసుకోండి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అమరాపురం: గ్రామాల్లో ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా కల్పిస్తున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. మంగళవారం మండలంలోని బసవనపల్లి గ్రామ పొలంలో కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9 లక్షల నిధులతో ఫారం పండ్ పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే వర్షపు నీరు కిందకు పోకుండా నిలువ ఉంటుందన్నారు. పనులకు హాజరయ్యే కూలీలకు త్వరగా బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆపద మిత్ర వలంటీర్ సోమశేఖర్ వివరించారు. మంగళవారం ఆయన పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమై ఎక్కువ నీరు, అలాగే మజ్జిగ, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి

- ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ


పెనుకొండలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ


మడకశిర: జీవీపాళ్యంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పెనుకొండ: జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రతి ఇంటా సంక్షేమాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ పేర్కొన్నారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని సౌదాగర్, ఉప్పర్‌బాడ, దర్గాపేట ప్రాంతాల్లో మంగళవారం కౌన్సిలర్లు షహనాబీ, ఫర్జియాభాను, అంజలి, యాసీన్, ఫరీద్, శ్రీరాములు నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులుతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబును గెలిపిస్తే కష్టాలే

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే కాక ఇవ్వని హామీలను సైతం నెరవేర్చి ప్రతి గడపలోనూ సంతోషం నింపారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా పేదలు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే రూ. 2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న కాలనీలు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, నాడు– నేడు వంటి అనేక పథకాలతో ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న జగనన్నను ప్రజలు దీవించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. చంద్రబాబును గెలిపిస్తే కష్టాలు తప్పవని, కరువు కాటకాలు నెలకొంటాయన్నారు. టీడీపీ హయాంలో జరిగిన మోసాలను, నేడు జగనన్న అమలు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ప్రజలు జగనన్నకు ఆశీర్వాదం అందించాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు అందించడానికి ముఖ్యమంత్రి కంకణబద్ధుడై ఉన్నారని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీలు, కొళాయిలు, వీధిలైట్లు వేయించాలని ప్రజలు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ బోయ సునీల్, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, ఎమ్మెల్సీ తనయుడు సానిపల్లి మహిధర్, వైస్.ఎంపీపీ రామాంజినేయులు, జయశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను సక్రమంగా అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కే మా దీవెనలు అందిస్తామని లబ్ధిదారులు, మహిళలు తెలిపారు. మండల పరిధిలోని జీవీపాళ్యం గ్రామ సచివాలయం పరిధిలోని జీవీపాళ్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేయకుండా దోచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు మోసపూరిత మాటలు మరోసారి నమ్మొద్దని ప్రజలకు సూచించారు. చంద్రబాబు పరిపాలనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ఎంత తేడా ఉందో గమనించాలన్నారు. ప్రతి ఇంటికీ పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ప్రజలు చెబుతుండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా.. వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వైస్ఎంపీపీ మూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, నాయకులు నరేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిప్పేస్వామి, ముద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు తిమ్మక్క. వీరిది మడకశిర మండలం జీవీ పాళ్యం. వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.82,000, రైతు భరోసా ద్వారా రూ.38,500, సున్నా వడ్డీ కింద రూ.5,616, వైఎస్సార్ ఆసరా రూ.12,064, సున్నా వడ్డీ (రైతు) పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాల ద్వారా రూ, 1,44,880 లక్షలు లబ్ధి పొందారు. తమ కుటుంబానికి ఎంతో భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కే మళ్లీ మా దీవెనలు ఉంటాయని తిమ్మక్క చెబుతున్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)
హిందూపురం: 38.0
పెనుకొండ: 40.0
మడకశిర: 38.0

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని వడిగేపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీ పాళ్యం గ్రామ సచివాలయం పరిధిలోని ముద్దారెడ్డిపాళ్యంలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేడు కొడిగెనహళ్లిలో ఇఫ్తార్ విందు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

లేపాక్షి: మండల వ్యాప్తంగా 4,640 మంది విద్యార్థులకు రాగి జావ గ్లాస్‌లను ఎంఈఓ నాగరాజు చేతులు మీదుగా మంగళవారం ఆయా ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు.

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్

- 'పురం'కు నిలిచిపోయిన నీటి సరఫరా


ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న దృశ్యం

హిందూపురం: గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి పంపింగ్‌కు వినియోగించే ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ కాలిపోవడంతో పట్టణంలో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పెనుకొండ ప్రాంతం నుంచి సరఫరా అవుతున్న విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్స్ కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్స్ మార్చేందుకు హైదరాబాద్ నుంచి కేబుల్స్ తెప్పిస్తున్నామని డీఈ నీరజ తెలిపారు. బుధవారం రాత్రిలోపు సమస్యను పరిష్కరించి వెంటనే వార్డులకు నీటిని సరఫరా చేస్తామన్నారు.

రాగి పంట కోత ప్రయోగం

లేపాక్షి: మండలంలోని కల్లూరు, కొండూరు గ్రామాల్లో రబీ సీజన్‌కు సంబంధించి రాగి పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జీఎం అల్తాఫ్‌ఖాన్ పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. కల్లూరులో నీటి పారుదల కింద సర్వే నంబర్ 243లో 98 సెంట్ల విస్తీర్ణంలో 5''5 సైజులో సాగు చేసిన రాగి పంటలో ప్రయోగం చేయగా 20 కేజీల దిగుబడి వచ్చిందని ఏఓ శ్రీలత తెలిపారు.

బీజేపీ పని అయిపోయింది


ప్రచార రథంలో శివకుమార్ తదితరులు


జన సంద్రంగా మారిన శని మహాత్మ సర్కిల్

- కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్

పావగడ: 'రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది. భారీ మెజార్టీ సాధించి కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టడం ఖాయం. బీజేపీ నుంచి మాజీ సీఎం జగదీశ్ శెట్టార్ తదితర దిగ్గజాలు కాంగ్రెస్‌లో చేరారు. అవినీతి అక్రమాలతో నిండిన బీజేపీ పని అయిపోయింది.' అని కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్ అన్నారు. స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల నేపథ్యంలో పావగడ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా తాలూకా నలుమూలల నుంచి వేలాది మంది జనం తరలివచ్చారు. పెనుకొండ రోడ్డు గురుభవన్ మైదానం నుంచి శని మహాత్మ సర్కిల్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పావగడకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన సోలార్ పార్క్ నిర్మించామని, తుమకూరు – రాయదుర్గం రైల్వే మార్గం ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారంటీ కార్డుల్లోని కుటుంబంలోని వ్యక్తికి 10 కేజీల బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంటి పెద్దకు నెలసరి రూ.2 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. స్థానిక కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేపీసీసీ కార్యాధ్యక్షుడు బీఎన్ చంద్రప్ప, ఏపీ మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణప్ప, అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


రొద్దం:నారనాగేపల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు


రొళ్ల: రత్నగిరిలో జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న అర్చకుల కుటుంబ సభ్యులు

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో ముత్యాలమ్మకు మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు జ్యోతులతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని జ్యోతులను అమ్మవారికి అప్పగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఎల్‌జీబీనగర్ సమీపంలో పెనుకొండ–పావగడ ప్రధాన రహదారి పక్కన వెలసిన బయలు ఆంజనేయస్వామికి తురకలాపట్నం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం అర్చకుల కుటుంబస్తులు వైభవంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయాన్నే నియమ నిష్టలతో ఇళ్లను శుభ్రం చేసి బియ్యం పిండితో చేసిన జ్యోతులను మొసుకుని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తరలివచ్చారు. కొల్హాపురి మహాలక్ష్మీదేవి, కాళికాంబ కామటేశ్వరస్వామితో పాటు మారెమ్మదేవి ఆలయం వద్దకు చేరుకుని చుట్టూ ప్రదక్షిణ చేసి జ్యోతులు సమర్పించారు. జ్యోతుల ఉత్సవానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన అర్చకుల కుటుంబ సభ్యులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆయా దేవాలయాల ప్రధాన అర్చకులు ప్రకాష్‌చార్, వసంతచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఇంటింటా మద్దతు

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్'


మడకశిర: గంగలవాయిపాళ్యంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: ప్రతి ఇంటి నుంచి జగనన్నకు పార్టీలకు అతీతంగా మద్దతు పెరుగుతోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం గంగలవాయిపాళ్యం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వారి అనుమతితో ఇంటి తలుపుకు సీఎం ఫొటో స్టిక్కర్‌ను అతికించారు. ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను సేకరించి సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇప్పటిలాగే భవిష్యత్‌లోనూ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే సక్రమంగా అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈనెల 20 లోపు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, సింగల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, నాయకులు నరేష్‌రెడ్డి, తిప్పేస్వామి, మారుతి, క్రిష్టారెడ్డి, ముద్దారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, పరిగి తదితర ప్రాంతాల్లో ఆయా సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, గృహసారథుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను వివరించడంతో సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ నారాయణ, నరసింహారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, గఫూర్‌ఖాన్, ఉగ్రారెడ్డి, శివశంకర్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని 5, 11, 13, 18, 21, 27, 28, 30, 32, 34 తదితర వార్డుల్లో కౌన్సిలర్లు, వార్డు కన్వీనర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, సునీత, మారుతిరెడ్డి, నాగేంద్రమ్మ, మల్లికార్జున, పర్వీన్‌భాను, నాగమణితో పాటు ఆయా వార్డు కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని శిరివరంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టిక్కర్లు, రశీదులు, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలు, రాజ్‌కుమార్, రవికుమార్, రాజు, ఆనంద్‌కుమార్, నరసింహమూర్తి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడిబండ: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేట, మరువపల్లి, అడదాకులుపల్లి, శెట్టిపల్లి, దుద్దేబండ నాగలూరు గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రతి గడపకూ తిరుగుతూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్‌రెడ్డి, తలారి రామాంజినేయులు, నారాయణ యాదవ్, నారాయణ స్వామి, శ్యాము నాయక్, మదన్ మోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మల్లికార్జున, రాజారెడ్డి, సుధాకర్ నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం సచివాలయకన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ స్వారక్క ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.


పరిగి: పెద్దిరెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


లేపాక్షి: శిరివరంలో ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తున్న గృహసారథులు


అమరాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండలంలో వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీ ఏర్పడిన మూడు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ పేర్కొన్నారు. చిలమత్తూరు– 1, 2 నుంచి రెండు, వీరాపురం సచివాలయ పరిధిలో ఒక పోస్టు ఖాళీ ఏర్పడ్డాయన్నారు. ఈనెల 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

పరిగి: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దారు సౌజన్యలక్ష్మి ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కార్యాలయ పనులపై వచ్చే మండల ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహం, వీఆర్వోలు మద్దిలేటి, కృష్ణమూర్తి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ

మడకశిర: మడకశిర నగర పంచాయతీలోని వైబీ హళ్లి క్రాస్‌లో మంగళవారం ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పించారు. డెమో నిర్వహించి అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక అధికారి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల షాపులో అగ్ని ప్రమాదం

మడకశిర: పట్టణంలోని ఆంటీ అంకుల్ బట్టల షాపులో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. షాపులోని ఫ్రిజ్ దగ్గర షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నరు. ఈ ప్రమాదం జరిగినప్పుడు షాపు ఓనర్ హిందూపురం వెళ్లారు. షాపులో నుంచి పొగరావడంతో చుట్టు పక్కల వారు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. వెంటనే ఫైర్ సిబ్బంది షాపు వద్దకు చేరుకుని మంటలు ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది. స్థానిక ఎస్ఐ సురేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రూ.15 వేలు నష్టం వచ్చిందని షాపు యజమాని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు శ్రద్ధ

రొళ్ల: గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా పారిశుధ్యం మెరుగు కోసం కార్మికులు శ్రద్ధ తీసుకోవాలని ఈఓఆర్డీ క్రిష్ణప్ప పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రత్నగిరిలోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వృథాగా పడివేసే చెత్తను తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సేకరించిన చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. అలా విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.